క్లుప్తంగా

నేత్రదానం..

ఖమ్మం వైద్యవిభాగం: వివిధ ప్రాంతాలకు చెందిన పాలిశెట్టి అన్నపూర్ణ, ఖాజా శ్రీధర్, కోనా మధుసూదన్‌రావు, మేకల కృష్ణ, చామర్తి సరస్వతి, నిమ్మల పుల్లారావు, కేతం రాధమ్మ, ఉప్పలవంచు కాంతమ్మ మృతి చెందగా.. వారి నేత్రాలను కుటుంబసభ్యులు నేత్రనిధికి దానం చేశారు. సేకరించిన నేత్రాలను హైదరాబాద్ ఎల్వీ ప్రసాద్, అపోలో, అగర్వాల్ ఐబ్యాంక్‌లకు పంపినట్లు ఖమ్మం నేత్రనిధి కార్యదర్శి ఆర్.అనంతపద్మనాభం ఒక ప్రకటనలో తెలిపారు.

మాజీ మంత్రి పరామర్శ

తిరుమలాయపాలెం: వెన్నెముక సమస్యతో బాధపడుతున్న మండలంలోని గోల్‌తండా శివారు జింకలగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు షేక్ కరీంను మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ బుధవారం పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట జెడ్పీటీసీ బెల్లం శ్రీనివాస్, నాయకులు కిరణ్, నరేంద్ర, షేక్ నజీర్, గోరే మియా, సైదా తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు

ఖమ్మంగాంధీచౌక్: చాంబర్ ఆఫ్ కామర్స్ ఖమ్మం ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని త్రీటౌన్ వర్తక సంఘం వద్ద ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకొని బుధవారం బాటసారులకు మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చిన్ని కృష్ణారావు, ఉపాధ్యక్షుడు సోమ నర్సింహారావు(జీవై నరేష్), సహాయ కార్యదర్శి మన్నెం కృష్ణలు ప్రారంభించగా.. సంఘం సెంట్రల్ ఈసీ సభ్యుడు కైలాసపు వేణుగోపాల్‌రావు, జనరల్ కార్యవర్గ సభ్యుడు జంగిలి రమణ, బండి సతీష్, పెనుగొండ శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్ ఆత్మహత్యాయత్నం

కామేపల్లి(కారేపల్లి): కుటుంబ కలహాల నేపథ్యాన ఓ ఆటోడ్రైవర్ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మండలంలోని ముచ్చర్లకు చెందిన ఆటోడ్రైవర్ బండారి కృష్ణప్రసాద్ ఇంట్లో జరిగిన చిన్న ఘర్షణతో మనస్థాపానికి గురై బుధవారం పురుగుల మందు తాగాడు. దీంతో ఆయనను కుటుంబ సభ్యులు ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

రిటైర్డ్ ఏఎస్సై మృతికి సంతాపం



సత్యనారాయణ (ఫైల్)

ఖమ్మంక్రైం: పోలీస్ శాఖలో ఏఎస్సైగా విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ చేసిన మట్టపర్తి సత్యనారాయణ అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతి చెందారు. జిల్లా పోలీసు శాఖలో ఆయన సమర్థవంతమైన అధికారిగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఈమేరకు ఖమ్మం కొత్తూరులోని ఆయన నివాసంలో మృతదేహం వద్ద జిల్లా పోలీస్ అసోసియేషన్ సభ్యులు, రిటైర్డ్ పోలీస్ అధికారుల సంఘం బాధ్యులు నివాళులర్పించారు.

నగరంలో సినిమాలు

తిరుమల	కస్టడీ
వినోద	2018
సాయిరాం	మళ్లీ పెళ్లి
ఆదిత్య	బిచ్చగాడు 2
శ్రీనివాస	మేమ్ ఫేమస్
సుందర్	ది కేరళ స్టోరీ

- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	38	బచ్చలికూర	2
వంకాయ	40		10
బెండకాయ	30	పాలకూర	3
పచ్చిమిర్చి	54		10
కాకర	50	చుక్కకూర	2
సోర	30		10
బీర	50	తోటకూర	2
దొండ	26		10
పొట్లకాయ	40	గోంగూర	2
చిక్కుడు	70		10
గోరుచిక్కుడు	46	మెంతికూర	5
క్యాబేజీ	20		20
క్యాలీఫ్లవర్	24	కొత్తిమీర	1
ఆలుగడ్డ	20		15
చామగడ్డ	44	పుదీన	1
క్యారెట్	46		15
క్యాప్సికం	66	-ఖమ్మం వ్యవసాయం	

అంబరాన్నంటేలా దశాబ్ది ఉత్సవాలు

- లకారంపై 21 రోజుల పాటు వేడుకలు
- సమీక్షలో మంత్రి అజయ్‌కుమార్



నగర అభివృద్ధిపై రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మంత్రి పువ్వాడ, కలెక్టర్, మేయర్ తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలను జిల్లా కేంద్రమైన ఖమ్మంలో అంబరాన్ని అంటేలా నిర్వహించాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సూచించారు. నగర పాలక సంస్థ కార్యాలయంలో మేయర్ పునుకొల్లు నీరజ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన సమీక్షలో మంత్రి మాట్లాడారు. ప్రజాప్రతినిధులు హోదాలో ఉండి ఇలాంటి వేడుకల్లో పాల్గొనేందుకు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం తొమ్మిదేళ్లలో సాధించిన విజయాలను ఇంటింటికీ తీసుకెళ్లాల్సిన ప్రణాళికను వివరించారు. శుక్రవారం నుంచి 21రోజుల పాటు లకారం ట్యాంక్‌బండ్‌పై ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

అభివృద్ధిని ప్రజలకు వివరించాలి..

గడిచిన తొమ్మిదేళ్ల కాలంలో ఖమ్మంలో జరిగిన అభివృద్ధి, ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలను అందరికీ వివరించాలని మంత్రి పువ్వాడ కార్పొరేటర్లకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రం ఏర్పడక ముందు ఖమ్మం ఎలా ఉంది, ఇప్పుడెలా అభివృద్ధి చెందిందో తెలపాలని సూచించారు. ప్రతీ కార్యక్రమంలో కార్పొరేటర్లతో పాటు డివిజన్‌లోని ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యేలా చూడాలన్నారు. అనంతరం కలెక్టర్ వీ.పీ.గౌతమ్ మాట్లాడుతూ దశాబ్ది ఉత్సవాలు ఖమ్మం మున్సిపల్ పరిధిలో ఘనంగా జరిగేలా అందరూ సహకరించాలని సూచించారు. అనంతరం ఖమ్మంలో జరిగిన అభివృద్ధి పనులపై నాడు–నేడు శీర్షికతో రూపొందించిన పోస్టర్ల ఆవిష్కరించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, అసిస్టెంట్ కమిషనర్ బి.మల్లీశ్వరి, కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

బూడిదెంపాడులో ఆలయ ప్రతిష్ఠామహోత్సవం..

రఘునాథపాలెం/ఖమ్మం మయూరిసెంటర్: రఘునాథపాలెం మండలంలోని బూడిదెంపాడులో శ్రీ సీతారామ చంద్రస్వామి, ముత్యాలమ్మ, గంగమ్మతల్లి, పెద్దమ్మతల్లి అమ్మవార్ల ఆలయాల ప్రతిష్ఠా మహోత్సవం బుధవారం జరిగింది. ఈ వేడుకల్లో రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని పూజలు చేశారు. సర్పంచ్ మీరా, ఆలయ కమిటీ బాధ్యుల ఆధ్వర్యాన ఏర్పాట్లు చేశారు. కాగా, రేషన్ షాపుల ద్వారా పేద, మధ్యతరగతి ప్రజలకు 12 రకాల నిత్యవసర సరుకులు, పది కేజీల సన్న బియ్యం ఉచితంగా అందచేయాలని పీఓడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్.శిరోమణి, పీవైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.వీ.రాకేష్, పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి టి.ఝాన్సీ తదితరులు మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌ను క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు.

బీఆర్ఎస్ అధికార ప్రతినిధిగా సుగుణరావు..



సుగుణరావుకు నియామకపత్రం ఇస్తున్న మంత్రి

ఖమ్మంమయూరిసెంటర్: బీఆర్ఎస్ ఖమ్మం నియోజకవర్గ అధికార ప్రతినిధిగా మేకల సుగుణరావు యాదవ్ నియమితులయ్యారు. ఈమేరకు బుధవారం మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. కాగా, సుగుణరావుకు బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, డీసీసీబీ, సుడా చైర్మన్లు కూరాకుల నాగభూషణం, బచ్చు విజయ్‌కుమార్,కార్పొరేటర్లు కూరాకుల వలరాజు, నాగండ్ల కోటేశ్వరరావు, లక్ష్మీప్రసన్న, బిచ్చాల తిరుమలరావు శుభాకాంక్షలు తెలిపారు.

తెలంగాణ పథకాలు దేశానికే ఆదర్శం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి

కూసుమంచి: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే ఉందాల ఉపేందర్‌రెడ్డి సూచించారు. బుధవారం పాలేరులోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ హయాంలో అభివృద్ధి, సంక్షేమంలో దూసుకుపోతూ.. నేడు దేశానికే ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. ఉత్సవ వేడుకల్లో భాగంగా మొక్కలు విరివిగా నాటాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీపీ బానోత్ శ్రీనివాస్, డీసీసీబీ డైరెక్టర్ ఇంటూరి శేఖర్, ఆత్మా చైర్మన్ బాలకృష్ణారెడ్డితో పాటు ఏసీపీ బస్వారెడ్డి, జలవనరుల శాఖ ఈఈ వెంకటేశ్వర్లు, డిప్యూటీ డీఅండ్ఎంహెచ్ఓ రాంబాబు, ఏడీఏ విజయచంద్ర, ఎంపీడీఓ కరుణాకర్‌రెడ్డి, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం..

నేలకొండపల్లి: మండలంలోని చెరువుమాధారంలో నూతన వధూవరులను పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి, టీపీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావు వేర్వేరుగా ఆశీర్వదించారు.ఆయన వెంట ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాల్లో నిరుపేదలకు ఇళ్ల స్థలాలు..

నేలకొండపల్లి: దశాబ్ది ఉత్సవాల్లో అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వనున్నట్లు నేలకొండపల్లి తహసీల్దార్ దారా ప్రసాద్ తెలిపారు. బుధవారం మండలంలోని రాజేశ్వరపురంలో బాధితుడు మునగంటి వీరబాబుకు ఇంటినిర్మాణానికి ప్రభుత్వస్థలం ఎంపిక చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని అప్పలనరసింహాపురం, నాచేపల్లి, సదాశివాపురం, మోటాపురం, రామచంద్రాపురం, శంకరగిరితండా గ్రామాల్లో 75 గజాల చొప్పున అర్హత కలిగిన పేదలకు పట్టాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. అర్హత కలిగిన వారు ఆయా గ్రామపంచాయతీ కార్యాలయాల్లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌లు మాధవి, వెంకయ్య, మాజీ సర్పంచ్ ఎర్రబోయిన నర్సయ్య, గ్రామ పెద్దలు జటంగి వెంకన్న, తాళ్లూరి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ 'గిరిజన బంధు' ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న రవిరాథోడ్

ఖమ్మం మామిళ్లగూడెం: గిరిజనులకు గిరిజన బంధు ఇవ్వాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ఎస్టీ మోర్చా జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో గిరిజనులకు పోడు పట్టాలు ఇవ్వడంతో పాటు పదిశాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రవిరాథోడ్ మాట్లాడుతూ.. గిరిజనుల హక్కుల పరిరక్షణ కోసం రాష్ట్రంలో ప్రత్యేక ఎస్టీ కమిషన్‌తో పాటు గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రుద్రప్రదీప్, భూక్యాశ్రీను, ఎస్టీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శులు రమేష్, మోహన్, జంప, హతిరామ్, వెంకటన్న, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా చండీయాగం



యాగంలో పాల్గొన్న భక్తులు

నేలకొండపల్లి: మండలంలోని రాజేశ్వరపురం గ్రామంలో శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవాలయంలో బుధవారం నిర్వహించిన చండీయాగం కనుల పండువగా జరిగింది. గత మూడు రోజుల నుంచి దేవాలయంలో వార్షికోత్సవంలో భాగంగా వేద పండితుల ఆధ్వర్యాన పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు మహా అన్నదానం చేశారు. సాయంత్రం మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ కోలాట నృత్య సంబరాలతో అమ్మవారిని గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయం వద్ద షెడ్ నిర్మాణానికి విరాళం అందించిన దాతలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో దేవాలయం కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లు పూర్తి



మాట్లాడుతున్న చైర్మన్ విజయగిరి సదానందచారి

ఖమ్మం మామిళ్లగూడెం: జూన్ 4న జరగనున్న తెలంగాణ విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘ నగర కమిటీ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆహ్వాన సంఘ చైర్మన్ విజయగిరి సదానందచారి, ప్రధాన ఎన్నికల అధికారి విశ్వనాథుల పాపాచారి తెలిపారు. బుధవారం సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఆదివారం నాడు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు 11 కేంద్రాల వద్ద పోలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాగా, గత రెండు రోజులుగా సంఘానికి సంబంధంలేనివారు తప్పుడు ప్రచారం చేయడం సరైందికాదని, వారిపై సంఘం తీసుకునే చట్టబద్ధమైన చర్యలకు బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు. ఈ సమావేశంలో ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి మామిళ్ల నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అష్టలక్ష్మి ఆలయ వార్షికోత్సవం



పూజలు పాల్గొన్న భక్తులు, కార్పొరేటర్లు

ఖమ్మంఅర్బన్: నగరంలోని 12వ డివిజన్‌లో గల అష్టలక్ష్మి ఆలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు 54 కుండాలతో హోమాలు, పూర్ణాహుతి, శాంతి కల్యాణం నిర్వహించారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహా అన్నదానం చేశారు. ప్రముఖ చిత్రకారులు రంగవల్లులతో వేసిన అమ్మవారి చిత్రం భక్తులను అలరించింది. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు చిరుమామిళ్ల లక్ష్మీనాగేశ్వరరావు, బిక్కసాని ప్రశాంతి జశ్వంత్, ఆళ్ల నిరీషారెడ్డి ఆంజిరెడ్డి, ఉట్ల జగన్, చేరుకుమల్లి శ్రీనివాస్, నున్నా వెంకటేశ్వరరావు, వద్దే సూరి, రామా మనీష్, మల్లెంపాటి రాము తదితరులు పాల్గొన్నారు.

బీటెక్ ఫలితాల్లో.. ఎస్‌బీఐటీ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న చైర్మన్ కృష్ణ

ఖమ్మంసహకారనగర్: జేఎన్‌టీయూ విడుదల చేసిన బీటెక్ మొదటి సంవత్సరం ఫలితాల్లో ఎస్‌బీఐటీ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. వివిధ విభాగాల్లో వై.అనూహ్య 94శాతం, ఎ.సాయితేజస్, రాధిక 92, సీహెచ్.అజయ్‌కుమార్ 90.74, ఎస్.కే.అయేషా అంజుం 90.63, పి.కావ్య 90.32, బి.ఉషశ్రీ 89.89, ఎం.డీ.అయేషా 89.53 శాతం మార్కులతో ప్రతిభ కనబర్చారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను చైర్మన్ కృష్ణ, అధ్యాపకులు అభినందించారు.

ఆర్థిక సాయం అందజేత



మానసకు ఆర్థిక సాయమందిస్తున్న దృశ్యం

రఘునాథపాలెం: మండలంలోని చిమ్మపూడి గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన ముత్యాల సత్యనారాయణ, శైలజ దంపతుల కూతురు మానస వివాహానికి రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర రూ.10వేల ఆర్థిక సాయమందించారు. ఈ ఆర్థిక సాయాన్ని మున్నూరుకాపు సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకుల గాంధీ చేతుల మీదుగా నవవధువు గృహంలో బుధవారం అందజేశారు. కార్యక్రమంలో జమ్మిశెట్టి నిరంజన్, ముత్యాల రాంబాబు, జలగం శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రభుత్వ విధానాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ప్రేమ్‌కుమార్

తిరుమలాయపాలెం: ప్రభుత్వ విధానాలపై ప్రజా సంఘాల బాధ్యులు అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని కాసా స్వచ్ఛంద సంస్థ కో ఆర్డినేటర్ ఎన్.ప్రేమ్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని మాదిరిపురంలో ప్రజా సంఘాల బాధ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జంతు సంపద, భూమి, నీరు వంటి వనరులపై ఉన్న చట్టపరమైన హక్కుల గురించి ప్రతి ఒక్కరికీ అవగాహన కల్గి ఉండాలన్నారు. ప్రజా సంఘాలు స్థానిక వనరులను ఉపయోగించుకుని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐక్య వేదిక మండల కమిటీ అధ్యక్షుడు గుజ్జ నర్సయ్య, సభ్యులు నీలమ్మ, మనోజ్, భద్రు, రజిత, అచ్చమ్మ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలి

తిరుమలాయపాలెం: ప్రభుత్వం ఉత్సవాల పేరుతో హడావిడీ చేయడం మానేసి నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి తిమ్మిడి హన్మంతరావు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని కాకరవాయిలో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ వస్తే నీళ్లు, నిధులు, నియామకాలు వస్తాయని చెప్పిన ప్రభుత్వం తెలంగాణ సంపదను దోచుకుంటుందని ఆరోపించారు. ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్న యువతకు ఉపాధి కల్పించేందుకు దృష్టి సారించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సైదులు, ఎలమంచి, శ్రీను, హుస్సేన్, అక్కమ్మ, రవి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ 'తాతా' పుట్టినరోజు వేడుకలు



మొక్క నాటుతున్న ఎమ్మెల్సీ తాతా మధుసూదన్

ఖమ్మం వైరారోడ్/ఖమ్మంవైద్యవిభాగం/కూసుమంచి: ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్ పుట్టినరోజు వేడుకలను బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కూసుమంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే జిల్లా యువజన అధ్యక్షుడు చింతనిప్పు కృష్ణ చైతన్య ఆధ్వర్యంలో బుధవారం స్థానిక జిల్లా ప్రభుత్వ ప్రధాన వైద్యశాలలోని మాతా శిశు కేంద్రం వద్ద 300 మంది నిరుపేదలకు అన్నదానం నిర్వహించారు. ఇదిలా ఉండగా.. గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో భాగంగా హైదరాబాద్‌లోని హిమయత్‌నగర్‌లో ఎమ్మెల్సీ తాతా ఎమ్మెల్యే క్వాటర్స్‌లో మొక్క నాటారు. కూసుమంచిలో కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ ఇంటూరి శేఖర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు వేముల వీరయ్య, ఉన్నం బ్రహ్మయ్య తదితరులు పాల్గొనగా.. అన్నదానంలో ఉద్యమకారులు బొమ్మెర రామ్మూర్తి, బీఆర్ఎస్ నాయకులు ముత్యాల వెంకటఅప్పారావు, అశ్విని, ఎమ్మెల్సీ పీఏ సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

విత్తనాలను సద్వినియోగం చేసుకోండి



విత్తనాలు అందిస్తున్న చైర్మన్, ప్రజాప్రతినిధులు

ఖమ్మంరూరల్: సహకార సంఘం ద్వారా ప్రభుత్వం రైతులకు అందిస్తున్న సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని ఏదులాపురం సొసైటీ చైర్మన్ జర్పుల లక్ష్మణ్‌నాయక్ అన్నారు. బుధవారం మండలంలోని నాయుడుపేటలో గల సంఘం కార్యాలయంలో రైతులకు సబ్సిడీపై జనుము, జీలుగు విత్తనాలను అందించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలను దేశంలో ఎక్కడా లేని విధంగా అమలు చేస్తూ రూ.వేలకోట్లు ఖర్చు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ఏ.వరప్రసాద్, సుడా డైరెక్టర్ జీ.సంజీవరెడ్డి, మారెమ్మ తల్లి ఆలయ కమిటీ చైర్మన్ మట్టా వెంకటేశ్వరరావు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బెల్లం వేణు, ఉపాధ్యక్షుడు కృష్ణారావు, ప్రధాన కార్యదర్శి పేరం వెంకటేశ్వర్లు, ఏ.వెంకన్న, సీఈఓ ఎండీ.అలీ తదితరులు పాల్గొన్నారు.

రైతు బంధు జిల్లా కమిటీకి రాజీనామా



డీఏఓకు రాజీనామా లేఖ అందిస్తున్న తిరుమలరావు

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్రప్రభుత్వం రైతుల విషయంలో అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరికి నిరసనగా రైతుబంధు జిల్లా కమిటీ సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు మందడపు తిరుమలరావు తెలిపారు. ఈ మేరకు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయనిర్మలకు బుధవారం తన రాజీనామాపత్రాన్ని అందజేసినట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతు రుణమాఫీ అమలుచేయకపోగా, అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు పరిహారం అందించడంలో జాప్యాన్ని నిరసిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఇక నుంచి మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి బాటలో కొనసాగనున్నట్లు వెల్లడించారు.

కృష్ణ నిలయాన్ని ప్రారంభించిన 'తుమ్మల'

కూసుమంచి: మండలంలోని గట్టుసింగారం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ లోడిగ వెంకన్న యాదవ్ తన తల్లిదండ్రులైన రోషాలు–లాలమ్మ పేరుతో నిర్మించిన కృష్ణ నిలయాన్ని బుధవారం మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నెల్లూరి ఖాదర్‌బాబు, మాజీ ఎంపీపీలు జూకూరి గోపాలరావు, రామసహాయం వెంకటరెడ్డి, జొన్నలగడ్డ రవికుమార్, యాదవ మహాసభ జిల్లా అధ్యక్షులు చిలకల వెంకటనర్సయ్య, చిత్తారు సింహాద్రి, మేకల మల్లిబాబు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలకు నీరు పట్టేదెవరు?





49వ డివిజన్‌లోని పట్టణ ప్రకృతి వనంలో నీళ్లు లేక ఎండిపోతున్న మొక్కలు

- రూ.లక్షలు వెచ్చించినా నీళ్లు లేక ఎండిపోతున్న మొక్కలు
- చోద్యం చూస్తున్న అధికారులు

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలో పచ్చదనం పెంపొందించేందుకు నూతన పార్కులు ఏర్పాటు చేయడంతో పాటు రోడ్ల వెంట, డివైడర్ల మధ్య, ఖాళీ స్థలాల్లో అధికారులు, పాలకులు మొక్కలను విరివిగా నాటి పెంచుతున్నారు. ప్రభుత్వం చేపట్టిన హరితహారంలో ఈ మొక్కలను నాటడమే కాక కేసీఆర్ ఆధ్వర్యంలో నిరంతర ప్రక్రియగా మొక్కలు నాటే కార్యక్రమం కొనసాగుతుంది. ఇంత వరకు భాగానే ఉన్నా నాటిన మొక్కలకు నీరు పెట్టడంలో సిబ్బంది అలసత్వం ప్రదర్శిస్తున్నారు. వారాలు గడుస్తున్నా.. మొక్కలకు నీరు పెట్టకపోవడంతో అవి వాడిపోతున్నాయి. వాడిపోతున్న మొక్కలను చూసిన వారు ఉసూరుమంటున్నారు.

రూ.లక్షలు ఖర్చు చేసి..

నగరంలోని 60 డివిజన్‌లలో మొక్కలను నాటారు. పట్టణ ప్రకృతి వనాలు ఏర్పాటు చేయడంతో పాటు, పార్కుల్లో, రోడ్ల వెంట మొక్కలు నాటేందుకు రూ.లక్షలు ఖర్చు చేశారు. పలు డివిజన్‌లలో పార్కులు, పట్టణ ప్రకృతి వనాల్లో నాటిన మొక్కలకు నీటిని పడుతున్నప్పటికీ.. కొన్ని డివిజన్‌లలో మొక్కలకు నీరు పోసే వారే కరువయ్యారు. స్థానిక సిబ్బంది మొక్కల రక్షణను పట్టించుకోవడం లేదు. నగరంలోని 49వ పట్టణ ప్రకృతి వనంలో వేసిన మొక్కలకు నీరు పెట్టకపోవడంతో అవి వాడిపోయి ఇలా దర్శనమిస్తున్నాయి.